## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నంబూరు
# మోహన్‌రావుకు ఘన సన్మానం



**తల్లాడ, /జూన్ 16 (జర్నలిస్ట్ వార్త):**తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన నంబూరు మోహన్‌రావును తల్లాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోడూరు నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, తల్లాడ గ్రామ ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తల్లాడ గ్రామానికి చెందిన నంబూరు మోహన్‌రావు రాష్ట్రస్థాయి బాధ్యతలు చేపట్టడం గ్రామానికి గర్వకారణమన్నారు. ఆర్యవైశ్య సమాజ సేవలో ఆయన మరింత ఉన్నత స్థానాలను అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దగ్గుల నారాయణరెడ్డి, రేగళ్ల పుల్లారెడ్డి, బెల్లంకొండ ఆంజనేయులు, శీలం వెంకటరెడ్డి, మిట్టపల్లి కృష్ణ, యాచవరపు వెంకటరెడ్డి, కటికి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని నంబూరు మోహన్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## దెబ్బతిన్న రోడ్డుకు తక్షణ మరమ్మతులు చేపట్టాలి



**తల్లాడ,/ జూన్ 16 (జర్నలిస్ట్ వార్త):**పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పాత సినిమా హాల్ నుండి అన్నారుగూడెం వరకు సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డు ఏడాది పూర్తికాకముందే దెబ్బతినడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. తల్లాడఅన్నారుగూడెం ప్రధాన రహదారిపై కొన్ని చోట్ల రోడ్డు పక్క భాగం భారీగా కృంగిపోవడంతో పాటు మట్టి కొట్టుకుపోయింది. దీంతో రహదారి వెడల్పు తగ్గి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ప్రమాద భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు ఇరుకుగా మారడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు పక్కకు తప్పుకునే సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికే రహదారి పరిస్థితి మరింత దిగజారుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు శాశ్వత మరమ్మతులు నిర్వహించాలని గ్రామ ప్రజలు, బాటసారులు కోరుతున్నారు. ప్రజాధనంతో నిర్మించిన రహదారి స్వల్పకాలంలోనే దెబ్బతినడంపై విచారణ జరిపి, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలని కూడా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఐస్ ఫ్రీజర్ దాతను సన్మానించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య.

**బయ్యారం/,జూన్ 16.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండలం కొత్తపేట గ్రామ సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ అభ్యర్థన మేరకు గ్రామ ప్రజలకు అవసరమైన సేవలను అందించాలనే ఉద్దేశ్యంతో ఆళ్ల శ్రీనివాస్ తండ్రి ఆళ్ల కోటయ్య జ్ఞాపకార్థంగా కొత్తపేట గ్రామానికి ఐస్ ఫ్రీజర్ (శవపేటిక)ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ఆళ్ల శ్రీనివాస్ ని,వారి మాతృమూర్తి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన వారి సేవా భావాన్ని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి,స్థానిక ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకుల కిలాడీ సూర్యం,దేవినేని రాము,గట్టు రాము,బోడ సాయి,రఘుపతి, మధన్,దేశిని రాంబాబు,అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేసిన కాచనపల్లి సర్పంచ్ యలం రేవతి.



**బయ్యారం/,జూన్ 16.(జర్నలిస్ట్ వార్త)**వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బయ్యారం మండలం కాచనపల్లి పాఠశాల విద్యార్థుల సందడితో కళకళలాడింది. 2026-27 విద్యా సంవత్సరానికి శ్రీకారం చుడుతూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులను సర్పంచ్ యలం రేవతి చేతులమీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ప్రభుత్వం అందిస్తున్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్ల స్వామి,ఉపాధ్యాయ బృందం కిషన్,స్వర్ణ,అంగన్వాడీ టీచర్స్ శ్రీదేవి, ఉమారాణి,కార్యదర్శి శేఖర్,ఉప సర్పంచ్ శ్రీను,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

### వైరా ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్

**వైరా/, జూన్ 16 (జర్నలిస్ట్ వార్త):**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ సూచించారు. మంగళవారం వైరా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డు, ఓపీ, ల్యాబ్ విభాగాలను సందర్శించి రోగులతో మాట్లాడారు. సేవలపై ఆరా తీసిన కలెక్టర్, అవసరమైన మందులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించాలని



అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యులు సమయపాలన పాటిస్తూ సేవలు అందిస్తే ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసం పెరుగుతుందని అన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అనవసర సి-సెక్షన్‌లను నివారించాలని సూచించారు. అనంతరం రూ.37.50 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న 100 పడకల నూతన ఏరియా ఆసుపత్రి పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వైద్య రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ పర్యటనలో డీసీహెచ్‌ఎస్ డా. రాజశేఖర్ గౌడ్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు రూ.18 వేల కనీస వేతనం చెల్లించాలి

**తల్లాడ,/ జూన్ 16 (జర్నలిస్ట్ వార్త):**

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని టీయూసీఐ తల్లాడ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ శ్రీధర్‌రాజుకు గ్రామపంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు సంఘసాని శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో టీయూసీఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ లాల్మియా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 13 వేల గ్రామపంచాయతీల్లో 54 వేల మంది ఆన్‌లైన్‌లో నమోదైన కార్మికులతో పాటు మరో 6 వేల మంది



నమోదు కాని కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా జీవో నంబర్6 ప్రకారం గ్రామపంచాయతీ కార్మికులకు రూ.14 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపుపై తీసుకున్న నిర్ణయాల్లో గ్రామపంచాయతీ కార్మికులను కూడా చేర్చి ప్రయోజనం కల్పించాలని కోరారు.

అనేక సంవత్సరాలుగా ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు లేకుండా గ్రామపంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని, వారికి తక్షణమే సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే జీవో నంబర్60 ప్రకారం మూడు కేటగిరీలుగా వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం నాయకులు, కార్మికులు రామకృష్ణ, యాకూబ్, వెంకటేశ్వర్లు, చాంద్‌పాషా, ఎల్లారావు, వేలాద్రి, సురేందర్‌రెడ్డి, సుజాత, ధనమ్మ, లక్ష్మి, రజిని, జ్యోతి, ప్రసన్నకుమార్, శిరీష తదితరులు పాల్గొన్నారు

# మాదిగ ఉపకులాల విద్యార్థుల్లో అక్షరాస్యత పెంపొందించడమే లక్ష్యం

**- కోనాపురం, రామారం గ్రామాల్లో గో టు విలేజ్ చైతన్య సదస్సులు**

**- వర్ధన్నపేట మండల ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ ఇంచార్జ్ జిల్లా ధర్మయ్య మాదిగ**

**వర్ధన్నపేట/జూన్ 16(జర్నలిస్ట్ వార్త):**

మాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థిని విద్యార్థుల్లో అక్షరాస్యతను పెంపొందించి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడమే ఎంఆర్పీఎస్, ఎంఎస్పీల ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట మండల ఇన్చార్జ్ జిల్లా ధర్మయ్య మాదిగ స్పష్టం చేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు చేపట్టిన గో టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కోనాపురం, రామారం గ్రామాల్లో మాదిగ విద్యార్థులు, తల్లిదండ్రులతో చైతన్య సదస్సులు నిర్వహించారు. కోనాపురంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేశం మాదిగ అధ్యక్షతన, రామారంలో ఎంఆర్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు చాడ కర్ణాకర్



మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు జిల్లా ధర్మయ్య మాదిగ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైన మాదిగ బిడ్డలు విద్య ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులతో పాటు, వివిధ కారణాల వల్ల చదువుకు దూరమైన వారిని గుర్తించి తిరిగి బడిబాట పట్టేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను సంపూర్ణంగా అందుకోవాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు. అందుకోసమే దేశ, రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ పల్లెలు, బస్తీల్లో ఈ చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే జూలై 7న ఎంఆర్పీఎస్ ఆవిర్భావ 32వ దినోత్సవ వేడుకలను జిల్లాలోని ప్రతి పల్లెలో పండుగ వాతావరణంలో జరుపుకోవాలని, నూతన దండోరా దిమ్మెలను ఏర్పాటు చేసి జెండా ఆవిష్కరణలు నిర్వహించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమాల్లో రామారం గ్రామ శాఖ అధ్యక్షుడు చిలుముల వెంకటస్వామి, జీవన్, ఎల్లయ్య, ఆనంద్, వెంకన్న, శీనన్న తదితర నాయకులు, స్థానిక యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సులను విజయవంతం చేశారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.1.97 కోట్లు

**- ప్రతి వార్డు సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**







**వర్ధన్నపేట/జూన్ 16(జర్నలిస్ట్ వార్త):**

వర్ధన్నపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అధ్యక్షతన తొలి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.1 కోటి 97 లక్షల 77 వేల నిధులకు కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా ప్రతి వార్డులో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి వర్ధన్నపేటను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, ఇందిరమ్మ ఇళ్లు, మార్కెట్ అభివృద్ధిపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమృత్ పథకం కింద అసంపూర్తిగా ఉన్న పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేసి, ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్య రాకుండా అవుట్‌సోర్సింగ్ ద్వారా మరో 10 మంది సిబ్బందిని నియమించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. అలాగే పట్టణ శివార్లలోని డివైడర్ల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా మార్పులు చేస్తామని, నూతన మున్సిఫ్ కోర్టుకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవలి అకాల వర్షాల బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.15 వేల ఆర్థిక సాయం అందేలా చూడాలని, రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల కింద అర్హులైన నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నేతావాత్ శిభారాణి, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, నునావత్ కమ్లి, మలోత్ దేవేందర్, తిరుపెల్లి వాణి, భూక్యా సునీత, గుజ్జ వీరన్న, చిలువేరు రమ, తుమ్మల అరుణ, తిరుపతి సురేష్, సిలువేరు కుమారస్వామి, మున్సిపల్ కమిషనర్ జోనా తదితరులు పాల్గొన్నారు.

